# వర్షాలు కురవాలని క్రిష్ణగిరి పాదాల గుట్టపై క్రిష్ణ పాదాలకు అభిషేకం



రంగారెడ్డి :శంకర్పల్లి :జులై 2: అక్షరం న్యూస్

: గత 20 రోజులుగా వర్షాలు కురవక పోవడంతో మొలకత్తిన మొలకలు ఎండిపోయే దశకు రావడంతో రైతులు విలపిస్తున్నారు. అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశాము, పంటలు పండకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ దిక్కు లేక పోతే ఆ దేవుడే దిక్కు అన్నట్లుగా గుబ్బడి పత్తెపురం లోని శ్రీ రాధాక్రిష్ణ ఆలయ క్షేత్రంలోని సనాతన కాలం నాటి క్రిష్ణగిరి పాదాల గుట్టపై ఉన్న క్రిష్ణ పాదాలకు గురువారం నాడు ఆ గ్రామస్తులతో పాటు మరకత శివలింగ నామకరణ భక్తుడు, శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్ కూడా పాల్గొని వర్షాలు కురియాలని అభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భూపతిరెడ్డ, జంగయ్య ముదిరాజ్, హరిశంకర్, ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు సర్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి

**•బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శివ ప్రకాష్.**





రంగారెడ్డి :శంకర్పల్లి :జులై 2: అక్షరం న్యూస్

: ప్రభుత్వం చేపట్టిన ఓటర్ల సవరణ, ఒకే కుటుంబానికి చెందిన ఓట్లన్ని ఒకే పోలింగ్ బూత్ లో ఉండే విధంగా చేపట్టే కార్యక్రమంలో భాగంగా గురువారం చైతన్యపురి డివిజన్ లో సర్ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్, డివిజన్ ప్రెసిడెంట్ తోట మహేష్ యాదవ్, ఫణిగిరి కాలనీ ప్రెసిడెంట్ అజయ్ తో కలిసి ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని వారు సూచించారు. ఫణిగిరి కాలనీ బూత్ నంబర్ 41, 42, 43 బూత్ లెవెల్ ఏజెంట్, బూత్ లెవెల్ ఆఫీసర్ కృష్ణవేణి, వల్లీ, ఆసిఫ్, టోనీ పాల్గొన్నారు.

# టంగుటూరులో ఇంటింటికీ ఓటరు జాబితా సవరణ

**•సీఈఓ-టీజీ సిబ్బంది ఆధ్వర్యంలో ఫారం-6 దరఖాస్తుల స్వీకరణ.**



రంగారెడ్డి జిల్లా :తాంగటూరు(శంకర్ పల్లి):జులై 2: అక్షరం న్యూస్ :

శంకర్పల్లి మండలం టంగుటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్ నెంబర్-98లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ - ఎస్ఐఆర్ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. సర్పంచ్ బద్దం హరిత కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ షెడ్యూల్ను విడుదల చేసి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉదయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఇ. సత్యనారాయణ, జీపీఓ మహాలక్ష్మి, బీఎల్ఓ ఎస్. వీరేందర్, వార్డు సభ్యుడు బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఈఓ-టీజీ అని రాసి ఉన్న టోపీలు ధరించిన సిబ్బంది, బీఎల్ఓలు గ్రామంలో ఇంటింటికీ తిరిగి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. పద్దెనిమిది ఏళ్లు నిండిన యువతీ యువకుల నుండి కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 దరఖాస్తులు, పేరు లేని వారు, చిరునామా మార్పు, తప్పుల సవరణ కోసం ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను స్వీకరించారు. జూలై 31వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ హరిత కృష్ణారెడ్డి, బీఎల్ఓ వీరేందర్ కోరారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున స్పందించి దరఖాస్తులు అందజేశారు.

# ఎమ్మెల్యే మదన్ మోహన్ సహకారంతో రూ.20 లక్షలతో నందివాడ చెరువు అభి వృద్ధి పనులు పూర్తి



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/జూలై 2/అక్షరం న్యూస్:ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక చొరవతో తాడ్వా యి మండలం నందివాడ గ్రామంలోరూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన చెరువు అభివృ ద్ధి పనులు విజయవంతంగా పూర్తయ్యాయి.గత ఏడాది కురిసిన భారీ వర్షాలు, వర దల కారణంగా నందివాడ చెరువు కట్ట తీ వ్రంగా దెబ్బతిని, ఎప్పుడైనా తెగిపోయే ప్ర మాదకర పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యే మదన్ మోహన్ ను కలి సి చెరువును అభివృద్ధి చేసి కట్టను బలో పేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తు ల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.ఈ పను ల్లో భాగంగా చెరువు కట్టకు పటిష్టమైన మ రమ్మతులు చేపట్టడంతో పాటు, పెరిగిన పి చ్చి మొక్కలను పూర్తిగా తొలగించి దీంతో వర్షాకాలంలో చెరువు మరింత సురక్షితం గా ఉండటమే కాకుండా, రైతులకు సాగునీ టి వినియోగంకూడాసులభతరం కానుంది.ఐంచిరకాలంగా ఎదురుచూస్తున్న ఈ సమస్య కు శాశ్వత పరిష్కారం లభించడంతో నంది వాడ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ విజ్ఞప్తిని వెంటనే గుర్తించి చెరువు అ భివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే మదన్ మో హన్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తె లిపారు.

# వివాహ వేడుకల్లో పాల్గొని, నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 02 / : గురువారం రోజు పీర్యతండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు భూక్య వినయ్ చెల్లెలు అయిన భూక్య సబితా వివాహ వేడుకల్లో పాల్గొని, నూతన దంపతులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రుస్తాపురం మాజీ ఎంపిటిసి మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ ధనావత్ మోహన్ బాబు, రుస్తాపురం గ్రామ ఉపసర్పంచ్ వంకరి ప్రసాద్ , తేజావత్ హరినాయక్ , యూత్ అధ్యక్షులు ధనావత్ ఉపేందర్ నాయక్ పాల్గొనడం జరిగింది.

# కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపాలి

**•కల్తీ ఆహారాన్ని అరికట్టడంలో కేంద్ర, ష్ట్ర ప్రభుత్వాలు విఫలం**

**•తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్..**



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 2/అక్షరం న్యూస్:-

దేశవ్యాప్తంగా కల్తీ ఆహార పదార్థాల తయారీ విక్రయాలు రోజురోజుకూ పెరిగిపోతూ ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ ఆందోళన వ్యక్తం చేశారు.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో గురువారం ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పండుగల సమయంలో మాత్రమే పరిమితంగా కనిపించిన కల్తీ ఆహారం నేడు ఉదయం తాగే పాల నుంచి రాత్రి భోజనం వరకు విస్తరించిందన్నారు. పిల్లలు తినే చాక్లెట్లు, నెయ్యి, పన్నీరు, వెన్న, కోవా, అల్లం-వెల్లుల్లి పేస్ట్, మసాలా పొడులు, బేకరీ ఉత్పత్తులు, సాస్లు, వంట నూనెలు తదితర దాదాపు అన్ని ఆహార ఉత్పత్తుల్లో కల్తీ చోటుచేసుకుంటోందని పేర్కొన్నారు.టన్నుల కొద్దీ నకిలీ ఆహార పదార్థాలు పట్టుబడుతున్నప్పటికీ మార్కెట్లో కల్తీ వ్యాపారం తగ్గడం లేదని ఇది కోట్ల రూపాయల టర్నోవర్తో నడిచే మాఫియాగా మారిందని విమర్శించారు. గడువు ముగిసిన ఉత్పత్తులకు కొత్త లేబుళ్లు అతికించడం, కుళ్లిపోయిన ముడి పదార్థాలను రసాయనాలతో శుభ్రపరచి మళ్లీ వినియోగించడం ప్రముఖ బ్రాండ్లను పోలిన ప్యాకింగ్లతో నకిలీ ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయడం వంటి ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, బేకరీలు, పెద్ద షాపింగ్ మాల్స్లో కూడా నాసిరకం, కల్తీ ఆహార పదార్థాలు విక్రయించడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతూ ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరిగి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్తీ ఆహారాన్ని అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, భారీ సంఖ్యలో ఫుడ్ ఇన్స్పెక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కల్తీ ముఠాలపై నిరంతర తనిఖీలు నిర్వహించి. నాసిరకం ఆహార పదార్థాలు విక్రయిస్తున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.తనిఖీల్లో సీజ్ చేసిన హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లు కొద్ది రోజులకే తిరిగి ప్రారంభమవుతున్నాయని. ఇలాంటి వారికి మళ్లీ అనుమతులు ఇవ్వకుండా క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ ముఠాలను పూర్తిగా నిర్మూలించే వరకు ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర పక్షాన ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్యాల ప్రకాష్ తెలిపారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**•అశ్వారావుపేటలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ.**

**•కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంది.**

భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేట / జూలై 2 / అక్షరం న్యూస్ -: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు.

### రేషన్ కార్డు కీలక గుర్తింపు పత్రం

ఈ సందర్భంగా జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ, రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అత్యంత కీలకమైన గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

### పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం

గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన అనేక మంది అర్హులు సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తిస్తూ పెద్దఎత్తున కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తోందని తెలిపారు.

### ప్రజా సంక్షేమమే లక్ష్యం

ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, అర్హులైన ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ పథకాలకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా తదితర సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు.

### లబ్ధిదారుల్లో హర్షం

రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమకు రేషన్ కార్డులు అందడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు.

### పాల్గొన్న నాయకులు

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, మండల యూత్ నాయకుడు జూపల్లి ప్రమోద్, టౌన్ అధ్యక్షుడు నండ్రు రమేష్, అల్లాడి వెంకట రామారావు, కౌన్సిలర్లు మిండా హరిబాబు, తిరుమలశెట్టి వెంకన్నబాబు, నార్లపాటి దివాకర్, షేక్ సైదు బాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరు మార్చడం దుర్మార్గం

- జాతిపితను అవమానించిన మోడి.
- ఆ ఐదు గ్రామపంచాయితీలు తెలంగాణకు ఇవ్వాలి.
- కరకట్ట నిర్మాణాన్నిపూర్తి చేయాలి.
- పేదల భూ సమస్యల పరిష్కారానికి ఐఖ్యపోరాటాలు.
- ఈ నెల 7,8,9 తేదీల్లో సిపిఐ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా.



భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం / జులై 2 / అక్షరం న్యూస్ -: మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయఉపాధిహామీ పథకం పేరును కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం విబిజి రామ్జీజీ పథకంగా పేరు మార్చడం దుర్మార్గమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్కే సాబీర్ పాషా అన్నారు. గురువారం స్థానిక రాఘవనియలం రెడ్ల సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలను పన్నిందని, కేంద్ర బడ్జెట్లో నిధులు కోతను పెట్టారని, కొన్ని దేశాల్లో ఒకరకమైన చెల్లింపులు ఉంటే ఇంకొన్ని రాష్ట్రాల్లో ఇంకోరకమైన చెల్లింపులు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని ప్రజలంతా ఒక్కటే అయినప్పుడు వేర్వేరు వేతనాలు ఏంటని ప్రశ్నించారు. ఈ పథకం ఉద్దేశ్యాన్ని నీరుగార్చే పద్దతి మానుకోవాలని, నిధులను పెంచాలన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపిలో కలిపిన ఐదు పంచాయితీలని తెలంగాణకు ఇవ్వాలని అన్నారు. ఈ సమస్య పరిష్కారంలో కోసం అనేక పోరాటాలు, పాదయాత్రలు చేశామని చెప్పారు. అధికార రాజకీయ పార్టీల నాయకులు దీనిపై స్పష్టమై వైఖరిని ప్రదర్శించాలని, రెండు తెలుగు రాష్ట్రాలు కేంద్రంతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఇక్కడి అభివృద్ధి చేసేందుకు కనీసం జాగకూడా లేదని, ఆ ఐదు పంచాయితీలు కలవడం ద్వారా వందలాది ఎకరాల భూమి వస్తుందని, తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. భద్రాద్రి అభివృద్ధిని గత పాలకులు విస్మరించారని, రామాలయాభివృద్ధికి ఇచ్చిన మాటను నిలుపుకోలేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రామాలయాభివృద్ధికి నిధులు విడుదల చేయడం సంతోషమని, ఆ నిధులు దుర్వినియోగం కాకుండా నాణ్యతతో కట్టడాలు కట్టాలని కోరారు. గోదావరి వరదల సమయం ఆసన్నమైందని, అసంపూర్తిగా ఉన్న కరకట్ట నిర్మాణాన్నిపూర్తి చేసి వరద నీరు పట్టణంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతల ప్రజలను ఆదుకోవాలని, వారికి ఎత్తైన ప్రదేశాల్లో ఇండ్లు కట్టించి ఇవ్వాలన్నారు. 2022 గోదావరి వరదల సమయంలో భద్రాచలం పర్యటనకు వచ్చిన కేసిఆర్ నిర్వాసిత కాలనీలు కట్టిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని, ప్రస్తుత ప్రభుత్వం అందుకు పూనుకోవాలన్నారు. పేదలు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై వామపక్ష పార్టీలు ఐఖ్యపోరాటాలు సాగిస్తున్నాయని, ఇందులో భాగంగా ఈనెల 6వ తేదిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టామని చెప్పారు. పేదవానికి ఇళ్లు, ప్రతి గుడెసకు పట్టా అనే నినాదంతో 9 కమ్యూనిస్టు పార్టీల ఐఖ్య పోరాటంగా ఇది

సాగుతుందన్నారు. ప్రభుత్వాలు ప్రజల మౌళిక సమస్యల పరిష్కారానికి అలోచన చేయాలని తెలిపారు. పోడు భూముల సమస్యలను గత పాలకులు కొద్దిగా పరిష్కరించినా ఇకా చాలా వరకు అలానే ఉందని, 2 లక్షల 40 వేల ఎకరాలకు జిల్లాలో ఇంకా పట్టాలివ్వాలని తెలిపారు. తరతరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్న గిరిజనేతర పేదలు కూడా హక్కు పత్రాలు పొందేందుకు చట్టం అమోదయోగ్యంగా ఉందని, దీనిని పాలకులు పరిష్కరించాలని కోరారు. ఆర్ఎఫ్ పట్టాలు ఉన్న భూములకు విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని, సాగువిషయంలో అటవీశాఖ కొర్రీలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సీతమ్మసాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల వల్ల ఇక్కడి ప్రజలకు ఏ మాత్రం లాభం లేదని, ఒక్క ఎకరాకి కూడా సాగునీరు పారే పరిస్థితి లేదన్నారు. ఈ జిల్లాలోని గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించుకు పోతున్న పాలకులు ఈ ప్రాంతానికి కూడా ప్రయోజనాలు జరిగేలా చూడాలన్నారు. ప్రతీ అంశాన్ని ఎంఎల్ఎ కూనంనేని ప్రాంతాలకు అతీతంగా అనేక సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. జిల్లాకు జరుగుతున్న అన్యాయాలను పాలకులకు తెలిసే విధంగా పోరాటాల కేంద్రమైన భద్రాచలంలో ఈనెల 7,8,9 తేదీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ పోరాటాల రూపకల్పన ఇక్కడి నుండే ప్రారంభం కానుందని మొదటి రెండు రోజులు కమ్మ సత్రంలో చివరి రోజైన 9వ తేది రాఘవ నిలయం రెడ్ల సత్రంలో ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మన కర్తవ్యం అనే అంశాన్ని బోధిస్తారన్నారు. అదేవిధంగా మార్క్సిజం సమకాలీన సమాజంలో దాని పాత్ర అనే అంశాన్ని యుగల్ రాయలు, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో భారతదేశం, పర్యవసానాలు అనే అంశపై మోహన్ రెడ్డి, భారతీయ చరిత్ర, సంస్కృతి, అర్ఎస్ఎస్ వక్రీకరణను సోమసుందర్, మతం మతోన్మాదం, కేంద్రంలో అమలువుతున్న హిందుత్వ ఎజెండా పై ఎస్ వేణుగోపాల్, సిపిఐ ఎదుర్కొంటున్న సవాళ్లు, అధిగమించే మార్గాలపై ప్రెస్ అకాడమి చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ విప్లవోద్యమ చరిత్ర పై చలసాని వెంకటరామారావు, విప్లవపార్టీ ఆవశ్యకత, పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణం పై బాగం హేమంతరావు బోధించనున్నారు. ఈ మూడు రోజుల శిక్షణా తరగతులను జయప్రథం చేసేందుకు అంతా కృషి చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాదం, కల్లూరి వెంకటేశ్వరాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, మువ్వా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు ఏర్పాటుపై అధిష్టానానికి ఫిర్యాదు చేసిన తెలంగాణ సీనియర్ కాంగ్రెస్ నేతలు..



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 02 / : టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకులను సంప్రదించకుండానే నియామకాలను ఖరారు చేసిన సీఎం రేవంత్ రెడ్డి. మంత్రి కొండా సురేఖను సైతం సంప్రదించలేదనే ఆరోపణల మధ్య మరింత ముదిరిన వివాదం . తమకు తెలియకుండానే ఏకపక్షంగా నియామకాలు జరిగాయని తెలంగాణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు న్యూఢిల్లీలోని పార్టీ హైకమాండ్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం . ట్రస్ట్ బోర్డులో వినోద్ వెంకటస్వామిని చేర్చడంతో, ఇప్పటికే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఉండగా, ఆయన కొడుకు ఎంపీ అవ్వగా మళ్లీ ట్రస్ట్ బోర్డులో స్థానం ఎలా కల్పించారని కాంగ్రెస్ నాయకుల అసంతృప్తి . మరోవైపు నటుడు చిరంజీవి భార్య కొణిదెల సురేఖను చేర్చడంతో ఆంధ్రప్రదేశ్‌తో సంబంధం ఉన్న ఆమెకు స్థానం కల్పించారని తీవ్ర విమర్శలు. మాజీ బీఆర్ఎస్ ఎంపీ సోదరుడు సత్యనారాయణ రెడ్డిని ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా నియమించడం మరో వివాదం.

ఈ వివాదాన్ని వెంటనే పరిష్కరించకపోతే, పెద్ద రాజకీయ సంక్షోభంగా మారవచ్చని కాంగ్రెస్ వర్గాల ఆందోళన...

## ఎనిమిదేళ్ల తర్వాత భర్తీ చేసిన అంగన్వాడీ టీచర్ పోస్టుపై వివాదం

- స్థానిక అర్హులను పక్కనపెట్టి ఇతర తండా అభ్యర్థికి అవకాశం ఇచ్చారంటూ ఆందోళన..
- పారదర్శకంగా విచారణ చేసి నియామకాన్ని పునఃసమీక్షించాలని గిరిజనుల డిమాండ్..




హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 2/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీరభద్రనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తపల్లి తండా అంగన్వాడీ టీచర్ పోస్టు భర్తీ వివాదాస్పదంగా మారింది. దాదాపు ఎనిమిదేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టును స్థానిక అర్హులైన మహిళలకు కేటాయించకుండా సమీపంలోని మంక్యా నాయక్ తండాకు చెందిన అంగన్వాడీ ఆయా బానోతు కమలను టీచర్‌గా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం గిరిజనులు గ్రామపంచాయతీ కార్యాలయం అంగన్వాడీ కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు.

గ్రామస్తుల కథనం ప్రకారం పోస్టు ఖాళీగా ఉన్న నాటి నుంచి తమ తండాకు చెందిన పలువురు నిరుద్యోగ మహిళలు ఉద్యోగం కోసం ఎదురుచూశారు. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో స్థానిక అర్హులైన మహిళలు దరఖాస్తులు సమర్పించినప్పటికీ చివరికి వారిని పక్కనపెట్టి ఇతర తండాకు చెందిన అభ్యర్థిని ఎంపిక చేయడం అన్యాయమని ఆరోపించారు.

ఎనిమిదేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టును ఇప్పుడు ఎందుకు భర్తీ చేశారు? స్థానికుల దరఖాస్తులను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? మా తండాకు చెందిన పోస్టును ఇతర తండాకు ఎలా కేటాయించారు? అంటూ గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించలేదని ఆరోపిస్తూ, పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.తండాలో అర్హత కలిగిన నిరుద్యోగ మహిళలు ఉన్నప్పటికీ వారికి అవకాశం కల్పించకపోవడం స్థానిక యువతలో తీవ్ర నిరాశకు గురి చేసిందని గ్రామ పెద్దలు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ నిర్ణయం విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. నియామక ప్రక్రియను వెంటనే పునఃసమీక్షించి స్థానిక అర్హురాలికే అవకాశం కల్పించాలని లేకపోతే జిల్లా ఉన్నతాధికారులను ఆశ్రయించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ విషయమై సీడీపీవో స్వరూపను వివరణ కోరగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్వాడీ ఆయాలకు చేపట్టిన పదోన్నతుల ప్రక్రియలో భాగంగానే బానోతు కమలను అంగన్వాడీ టీచర్‌గా నియమించినట్లు తెలిపారు. అయితే అధికారుల వివరణతో గ్రామస్తులు సంతృప్తి చెందలేదు. స్థానికులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ నియామకాన్ని రద్దు చేసి పునఃపరిశీలించాలని పట్టుబడుతున్నారు. ఈ వ్యవహారం మండలవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# సంఘటిత పోరాటంతోనే సమస్యల పరిష్కారం






- ఆటో కార్మికుల సంక్షేమానికి నిరంతర పోరాటం.
- ఇంధన ధరల నియంత్రణ, సామాజిక భద్రత కల్పించాలి.
- నియన్‌లో చేరిన 150 మంది ఆటో డ్రైవర్లు.
- రాష్ట్ర అధ్యక్షులు, కొత్తగూడెం పట్టణ సిపిఐ పార్టీ కార్యదర్శి కంచర్ల జమలయ్య.

భద్రాద్రి కొత్తగూడెం /కొత్తగూడెం / జూలై 2 / అక్షరం న్యూస్ -: సంఘటిత పోరాటంతోనే ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, కొత్తగూడెం పట్టణ సిపిఐ పార్టీ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. శేషగిరి భవన్ లో గురువారం ఏఐటియూసి అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ 15వ పట్టణ మహాసభ యూనియన్ అధ్యక్షులు అబ్బులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు వివిధ అడ్డాల నుంచి పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు, కార్మికులు హాజరై సభను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఉపాధి భద్రత కోసం ఏఐటియూసి నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం ఉద్యమిస్తామని హామీ ఇచ్చారు. పెరుగుతున్న ఇంధన ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా ఆటో కార్మికుల సంక్షేమ పథకాల అమలు, సామాజిక భద్రత, ప్రమాద బీమా, పెన్షన్ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. మహాసభలో యూనియన్ బలోపేతం, సభ్యత్వ నమోదు విస్తరణ, కార్మికుల హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యాచరణపై పలు తీర్మానాలను ఆమోదించినట్లు పేర్కొన్నారు.

ఐటీయూసీలో భారీ చేరికలు :

కాగా, ఈ మహాసభలో వివిధ ఆటో అడ్డాల నుంచి 150 మంది ఆటో డ్రైవర్లు యూనియన్‌లో చేరగా, కంచర్ల జమలయ్య వారికి పార్టీ కండువా కప్పి సంఘంలోకి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతనంగా యూనియన్‌లో చేరిన ఆటో వర్కర్లు మాట్లాడుతూ, తమ సమస్యల పరిష్కారం కోసం ఏఐటియూసి ఆధ్వర్యంలో ఐక్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫయామ్, మర్రి కృష్ణ, ఆరెళ్ళి కృష్ణ, అబ్బులు, విజ్జి, బాబు జానీ దేశి, బోట్టు శ్రీను, మంద శ్రీసు, జలీల్, గౌస్, చింటు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకపురంలో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

- ఋగ్గురు అరెస్ట్ -- రూ.5,500 నగదు, రెండు బైకులు స్వాధీనం.
- జూద నిర్వాహకులకు ఎలాంటి ఉపేక్ష ఉండదు: ఎస్ఐ యయాతి రాజు హెచ్చరిక.

భద్రాద్రి కొత్తగూడెం/ అశ్వారావుపేట /, జూలై 2 / అక్షరం న్యూస్ -:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 5,500 నగదుతో పాటు రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.గురువారం సాయంత్రం వినాయకపురం గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో అశ్వారావుపేట ఎస్‌హెచ్‌వో, ఎస్ఐ యయాతి రాజు ఆధ్వర్యంలో పోలీసు బృందం ఆకస్మికంగా దాడి నిర్వహించింది. పోలీసులను గమనించిన కొందరు పరారయ్యేందుకు ప్రయత్నించగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పేకాట నిర్వహణకు వినియోగిస్తున్న రూ.5,500 నగదు, రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### అక్రమ జూదాలపై ఉక్కుపాదం

పేకాట, కోడిపందాలు వంటి జూద కార్యకలాపాలు యువతను తప్పుదారి పట్టించడంతో పాటు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తాయని పోలీసులు తెలిపారు. మండల వ్యాప్తంగా గ్రామాలు, శివారు ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ అక్రమ జూదాలపై నిరంతరం తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

### సమాచారం ఇవ్వండి.. గోప్యంగా ఉంచుతాం

పేకాట, కోడిపందాలు లేదా ఇతర అక్రమ జూద కార్యకలాపాలను నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ యయాతి రాజు హెచ్చరించారు. ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే డయల్-100కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజల సహకారంతో మండలంలో అక్రమ జూదాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## అమాయకులకు డబ్బు ఆశ చూపి దోపిడీ

పోలీసుల వేషంలో బెదిరించి లూటీలు

సత్తుపల్లి గంగారాం డెకాయిటీ కేసును ఛేదించిన పోలీసులు

12 మంది నిందితుల అరెస్ట్..మరో ఇద్దరి కోసం గాలింపు

దోపిడీదారుల్లో ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నట్లు గుర్తింపు

ఖమ్మం,జూలై2: బ్లాక్‌మనీని వైట్‌గా మారుస్తామని అమాయకులకు ఆశ చూపించి.. అనంతరం పోలీసుల వేషంలో బెదిరించి నగదు దోచుకున్న ముఠాను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారంలో జరిగిన సంచలన డెకాయిటీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలోని సత్తుపల్లి పోలీస్ ప్రత్యేక బృందాలు ఈ కేసులో ముమ్మర దర్యాప్తు జరిపి మొత్తం 12 మంది నిందితులను అరెస్ట్ చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే ఈ దోపిడీ ముఠాలో భాగస్వాములు కావడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. అరెస్టైన వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించగా, ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఈ కేసులో 14 మంది నిందితుల్లో 12 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. నిందితుల్లో ఓ కానిస్టేబుల్, ఆర్ఎస్సై కూడా ఉన్నట్లు తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. గత నెల 25న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కుర్రా గంగాధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పట్టణ సీఐ టి. శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గంగారం శివారులో నిర్వహిస్తున్న తనిఖీల్లో 12 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం తెలిసింది. దర్యాప్తులో ఏలూరు జిల్లా వెంకటాపురానికి చెందిన ఈద చంటిబాబు ఈ ముఠా సూత్రధారిగా గుర్తించారు. అతడు మరో 13 మందితో కలిసి వివిధ సిమ్‌కార్డుల ద్వారా అమాయకులకు ఫోన్ చేసి, తాము రియల్ ఎస్టేట్ వ్యాపారులమని.. తమ వద్ద ఉన్న బ్లాక్‌మనీని వైట్‌మనీగా మార్చుకోవాల్సి ఉందని నమ్మించేవారు. రూ.10 లక్షలు ఇస్తే రూ.40 లక్షలు ఖాతాలో జమ చేస్తామని ఆశ చూపించి బాధితులను నిర్ణయించిన ప్రాంతానికి రప్పించేవారు. బాధితులు నగదు తీసుకొచ్చిన తర్వాత డమ్మీ కరెన్సీ నింపిన బ్యాగును ఇచ్చేవారు. అదే సమయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ముఠాలోని కొందరు నిజమైన పోలీసులు.. నకిలీ పోలీసులతో అక్కడికి చేరుకుని దాడి చేసేవారు. నకిలీ కరెన్సీ వ్యాపారం చేస్తున్నారంటూ బెదిరించి బాధితుల వద్ద ఉన్న నగదును లాక్కొని పరారయ్యేవారు. ఇదే తరహాలో పలు ప్రాంతాల్లో మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో టీజీఎస్పీ 15వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ ముళ్లగిరి వర్ధన్, ఆర్ఎస్సై బైరా కేశవరావు ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని ఏసీపీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.17.60 లక్షల నగదు, మూడు కార్లు, ఓ స్కూటీ, సెల్‌ఫోన్లు, పోలీసు దుస్తులు, బేడీలు, డమ్మీ కరెన్సీ నోట్ల బండిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

# అశ్వారావుపేటకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వినతి.
- గిరిజన, గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / అశ్వారావుపేట / జూలై 2 / అక్షరం న్యూస్ –: నియోజకవర్గంలోని గిరిజన, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో అశ్వారావుపేటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ప్రత్యేక వినతిపత్రాన్ని సమర్పించారు.

### గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్య దూరం

అశ్వారావుపేట నియోజకవర్గం పూర్తిగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతం కావడంతో ఇక్కడి విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యను అభ్యసించాలంటే ఇతర జిల్లాలు లేదా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన అనేక మంది విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక సాంకేతిక విద్యకు దూరమవుతున్నారని తెలిపారు.

### ఐదు మండలాల విద్యార్థులకు ప్రయోజనం

అశ్వారావుపేటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తే అశ్వారావుపేటతో పాటు దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన, ఎస్సీ, బీసీ, పేద కుటుంబాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన డిప్లొమా విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

### ఉపాధి అవకాశాలకు ఊతం

పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించడంలో పాలిటెక్నిక్ విద్య కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అశ్వారావుపేటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు అత్యవసరమని వివరించారు. కళాశాల ఏర్పాటుతో స్థానిక యువతకు సాంకేతిక విద్యతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

### సానుకూలంగా పరిశీలిస్తాం: ముఖ్యమంత్రి

ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించాలని ఎమ్మెల్యే కోరగా, ప్రభుత్వం అన్ని కోణాల్లో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు సమావేశం అనంతరం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు.

### విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆశాభావం

అశ్వారావుపేటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు జరిగితే గిరిజన ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధికి కొత్త దిశ ఏర్పడటంతో పాటు స్థానిక యువతకు సాంకేతిక విద్య, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్







- ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి..
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూలై 2 / అక్షరం న్యూస్ –:భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డాక్టర్లు, ఇతర సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి వారి








హాజరు, విధుల నిర్వహణపై ఆరా తీశారు. ఆసుపత్రి సిబ్బంది ఎన్ని షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రసూతి వార్డులో చికిత్స పొందుతున్న మహిళల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. మూడు షిఫ్టుల్లో రోగులకు సేవలు అందిస్తున్నట్లు వైద్యులు వివరించారు. జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవల నాణ్యత, మందుల లభ్యత, వైద్యులు, సిబ్బంది స్పందనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట హాస్పటల్ సూపర్డెంట్ ఎం రాధా మోహన్, డివైసిఎస్ఆర్ఎంఓ సీతారాం, ఆర్ ఎం ఓ చైతన్య, కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# సవాళ్ల రాజకీయాలు !




హైదరాబాద్, జూలై2, తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్లు ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బిఆర్ఎస్ పనిచేస్తోంది. విపక్ష బిఆర్ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సిఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. ఎపిలో కూడా దాదాపు ఇదే తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. జగన్ పార్టీని గొడ్డలి పార్టీ అంటూ అధికార టిడిపి దుమ్మెత్తి పోస్తోంది. జగన్ కూడా ఎపిలో చట్టాలకు విలువ లేకుండా పోయిందని అంటున్నారు. మొత్తంగా అభివృద్ది, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు. ఇకపోతే తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బిఆర్ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సిఎం రేవంత్ సహా మంత్రులు అడపాదడపా విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బిఆర్ఎస్ నేతలు సవాళ్లు విసరుతున్నారు. అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కెటిఆర్ చాలెంజ్ చేశారు.కాగా,కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తార న్నారు. ఇలా రోజుకో సవాల్, ప్రతి సవాల్‌లో రాజకీయాలు నడుస్తున్నా యి. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు అడపాదడపా బిజెపి, బిఆర్ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి. అందునా అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశ్యం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సిఎంనని పదేపదే ప్రకటిస్తున్నా రు. ఇదంతాఒక




ఎత్తయితే విపక్ష బిఆర్ఎస్, బిజెపిలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపతేం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు.

ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తానని ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో ఉన్నారన్నది పొలిటికల్ టాక్. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడుతోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. కానీ, ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలుపెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది. . ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు,తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. .

# యూజర్‌నేమ్ ఫీచర్ ఇంకా అందుబాటులోకి తీసుకురాలేదు

- దశలవారీగా తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నాం
- యూజర్ నేమ్ ఉన్నా ఫోన్ నంబర్ తప్పనిసరి
- కేంద్రం అభ్యంతరాలకు వాట్సాప్ సమాధానం

న్యూఢిల్లీ,జూలై2 వాట్సాప్‌లో ప్రవేశపెట్టబోతున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో మెటా సంస్థకు చెందిన వాట్సాప్ కీలక వివరణ ఇచ్చింది. ప్రస్తుతం యూజర్‌నేమ్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురాలేదని, వినియోగదారులు తమకు నచ్చిన యూజర్ నేమ్‌ను ముందస్తుగా రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని స్పష్టం చేసింది. ఈ ఫీచర్‌ను ఈ ఏడాది చివర్లో దశలవారీగా అమలు చేస్తామని వెల్లడించింది. యూజర్‌నేమ్ ఫీచర్‌తో వినియోగదారులు తమ మొబైల్ నంబర్‌ను వెల్లడించకుండా కొత్త వ్యక్తులు, గ్రూపులతో కనెక్ట్ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ ఫీచర్‌తో గోప్యత, భద్రత, నకిలీ ఖాతాలు, మోసాలు వంటి అంశాలపై వస్తున్న సందేహాలకు ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చింది. యూజర్‌నేమ్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సృష్టించాల్సిన అవసరం లేదని వాట్సాప్ తెలిపింది. ఇది పూర్తిగా వారి ఇష్టమని పేర్కొంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఇప్పటికే ఉన్న యూజర్‌నేమ్‌లు ఆయా ఖాతాదారుల కోసం రిజర్వ్ చేయబడతాయని వాట్సాప్ తెలిపింది. అలాగే ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, మెటా వెరిఫైడ్ ఖాతాలకు సంబంధించిన పేర్లు, వాటి వేరియేషన్లు కూడా దుర్వినియోగానికి గురి కాకుండా రక్షిస్తామని పేర్కొంది. ఒకవేళ సాధారణ పేరు ఇప్పటికే మరొకరు తీసుకున్నట్లయితే, ప్రత్యామ్నాయ యూజర్‌నేమ్‌లను సూచించే జనరేటర్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపింది. తన యూజర్‌నేమ్‌కు దగ్గరగా మరో వ్యక్తి పేరు సృష్టించి మోసాలకు పాల్పడితే ఎలా అనే ప్రశ్నకు వాట్సాప్ స్పందించింది. యూజర్‌నేమ్‌లను సెర్చ్ చేసే అవకాశం ఉండదని స్పష్టం చేసింది. యూజర్‌నేమ్ ఆధారంగా సందేశాలు పంపే ఫీచర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, కొత్త వ్యక్తి నుంచి మెసేజ్ వస్తే అతని




దేశం, ఖాతా వివరాలు, భద్రతా హెచ్చరికలు చూపిస్తామని తెలిపింది. ఇప్పటికే ఉన్న బ్లాక్, రిపోర్ట్ వంటి భద్రతా చర్యలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొంది.

యూజర్‌నేమ్‌తో పాటు 'యూజర్‌నేమ్ కీ' అనే అదనపు భద్రతా వ్యవస్థను కూడా ప్రవేశపెడుతున్నట్లు వాట్సాప్ వెల్లడించింది. దీన్ని యాక్టివేట్ చేసుకుంటే, అవతలి వ్యక్తికి యూజర్‌నేమ్‌తో పాటు కీ కూడా తెలిసి ఉండాల్సి ఉంటుంది. అవసరమైతే ఈ కీని ఎప్పుడైనా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపింది.

ఫేస్‌బుక్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న అదే యూజర్‌నేమ్‌ను వాట్సాప్‌లో కూడా ఉపయోగించాలనుకునే వారు ముందుగా ఆ ఖాతాలను లింక్ చేసి యాజమాన్యాన్ని నిర్ధారించుకోవాల్సి ఉంటుందని తెలిపింది. అనంతరం కావాలంటే ఆ ఖాతాలను అన్‌లింక్ చేసుకునే అవకాశం కూడా ఉంటుందని వెల్లడించింది.

యూజర్‌నేమ్ ఫీచర్ అమలుతో నకిలీ గుర్తింపులు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆర్థిక మోసాలు పెరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు, ఆర్థిక సంస్థలు, ప్రజాప్రతినిధుల పేర్లతో పోలిన యూజర్‌నేమ్‌లను దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని పేర్కొంటూ ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు ఈ ఫీచర్‌ను అమలు చేయొద్దని వాట్సాప్‌ను ఆదేశించింది. అలాగే ఫీచర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, భద్రతా చర్యలపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని నోటీసు జారీ చేసింది. దీనిపై స్పందించిన వాట్సాప్ ప్రతినిధి ప్రస్తుతం యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని, యూజర్‌నేమ్ ఆధారంగా మెసేజింగ్ సేవ ఇంకా ప్రారంభం కాలేదని

స్పష్టం చేశారు. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, మెటా వెర్గి÷డ్ ఖాతాలకు సంబంధించిన యూజర్‌నేమ్‌లను వారి అసలు యజమానుల కోసమే రిజర్వ్ చేసినట్లు తెలిపారు. అలాగే యూజర్‌నేమ్‌ను కచ్చితంగా తెలుసుకోవాల్సిన విధానం, యూజర్‌నేమ్ కీ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, మోసాల నివారణ వంటి పలు భద్రతా చర్యలను అమలు చేస్తున్నట్లు వివరించారు. వాట్సాప్‌ను ఉపయోగించడానికి మొబైల్ నంబర్ తప్పనిసరిగా కొనసాగుతుందని కూడా స్పష్టం చేశారు.

## జన్మతః పిల్లల పౌరసత్వం కేసు

- సుప్రీం తీర్పుతో ఊరట చెందిన ఎన్నారైలు...

న్యూయార్క్, జూలై2 విదేశీ వలసదారుల పిల్లల పౌరసత్వాన్ని పరిరక్షిస్తూ అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై భారతీయ అమెరికన్ల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసిన విషయం తెలిసిందే. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే.. వారిని అమెరికన్లుగానే పరిగణించాలని కోర్టు తీర్పునిచ్చింది. దీనిపై ఇండో అమెరికన్లు హర్షం చేస్తున్నారు. ఈ తీర్పు అమెరికాలోని వలస కుటుంబాలకు గొప్ప భరోసా కల్పించిందంటున్నారు. ట్రంప్ జారీచేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో ప్రత్యక్షంగా ప్రభావితం అయ్యేది భారత్, దక్షిణాసియా వలస కుటుంబాలేనన్నారు. అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పు 'చరిత్రాత్మక విజయం' అని పలువురు ఎన్నారైలు అభివర్ణించారు. దాదాపు 52 లక్షల మంది ఇండో అమెరికన్లలో 12 లక్షల మందికి పైగా ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని ఎఫ్ఐఐడీఎస్ అధ్యక్షుడు ఖండేరావ్ కంద్ తెలిపారు. అమెరికాలో ప్రస్తుతం 6 నుంచి 7 లక్షల మంది హెచ్1బీ వీసాదారులు ఉన్నట్లు తాజా అంచనాలు పేర్కొంటున్నాయి. వారిలో 70 శాతానికి పైగా భారతీయులే ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో హెచ్1బీ వీసాదారులకు ఊరట లభించనుంది.

## అగ్రరాజ్యం చీకటి కోణం

- రహస్యంగా 16మంది చిన్నారుల నిర్బంధం
- ఓ కేసు కోసం వెళ్లిన పోలీసులకు కనపడ్డ దృశ్యం

న్యూయార్క్,జూలై2 అగ్రరాజ్యం అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. 16 మంది చిన్నారులను ఏళ్ల తరబడి ఓ పాడుబడిన ఇంట్లో బంధించి ఉంచిన విషయం తాజాగా బయటపడింది. మరో కేసు దర్యాప్తు నిమిత్తం పోలీసులు ఆ ఇంటికి వెళ్లగా అక్కడ కనిపించిన దృశ్యాలు వారిని దిగ్భ్రాం÷-రతికి గురి చేశాయి. అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను వెంటనే రక్షించిన పోలీసులు, వారిని బంధించిన నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఒహాయో రాష్ట్రంలోని హామ్డెన్‌లో రైల్వే ట్రాక్ పక్కన దట్టమైన చెట్లు, పొదల మధ్య ఉన్న ఓ ఇంటికి పోలీసులు సెర్చ్ వారెంట్‌తో వెళ్లారు. అక్కడ 16 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలు బంధించి ఉంచినట్లు గుర్తించారు. గత నాలుగేళ్లుగా వారు అమానవీయ పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. బాధిత చిన్నారులను 12 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు గల ఒకే గదిలో ఉంచినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చిన్నారుల వయస్సు 18 నెలల నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండగా, వారిలో బాలురు, బాలికలు ఉన్నారు. అంతేకాక, ఆ ఇంట్లో ఇంతమంది చిన్నారులు ఉన్న విషయం చుట్టుపక్కల వారికి కూడా తెలియకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

చిన్నారులకు బయటి ప్రపంచంతో దాదాపు ఎలాంటి సంబంధం లేకుండా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వారిలో ఎవరినీ ఇప్పటివరకు తల్లిదండ్రులు పాఠశాలకు పంపలేదు. చాలా కాలం పాటు బంధించబడటంతో వారు సాధారణంగా మాట్లాడటానికే ఇబ్బంది పడుతున్నట్లు ఒహాయో అటార్నీ జనరల్ తెలిపారు. దాదాపు అందరూ అడవి మనుషుల్లా కనిపించారని ఆయన పేర్కొన్నారు. ఈ 16 మంది చిన్నారులూ ఒకే కుటుంబానికి చెందినవారని అధికారులు వెల్లడించారు. రక్షించిన వెంటనే ఏడుగురు చిన్నారులను చికిత్స కోసం కొలంబస్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హెలికాప్టర్‌లో అత్యవసర చికిత్స కోసం తరలించాల్సి వచ్చింది. ఘటనలో పిల్లల తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలైన గ్యారీ సైడర్స్ జూనియర్, గ్యారీ సైడర్స్ సీనియర్, క్రిస్టినా సైడర్స్, ఎలిజబెత్ సైడర్స్‌లపై సెకండ్-డిగ్రీ ఫెలనీ 'చైల్డ్ ఎండేంజర్‌మెంట్' అభియోగాలు నమోదు చేశారు. అనంతరం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరోవైపు ప్రతి నిందితుడికి 3 లక్షల డాలర్ల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేయాలని కోర్టు నిర్ణయించింది.

## రష్యాకు భారత రక్షణ ఎగుమతులు

### నాలుగు కంపెనీలోపై యూఎస్ నిషేధం ఎత్తివేత

వాషింగ్టన్,జూలై2:రష్యాకు రక్షణ సాంకేతికతను, యంత్ర పరికరాలను సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలతో గతంలో నాలుగు భారత కంపెనీలపై విధించిన ఆంక్షలను అమెరికా తాజాగా తొలగించింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్, లోకేశ్ మెషీన్స్ సంస్థలు కూడా ఉన్నాయి. వీటితో పాటు అహ్మదాబాద్‌కు చెందిన గేలక్సీ బేరింగ్స్, ఢిల్లీకి చెందిన శౌర్య ఏరోనాటిక్స్ కంపెనీలపై ఆంక్షలను అమెరికా తొలగించింది. యుద్ధ పరికరాల తయారీకి వాడే మైక్రోఎలక్ట్రానిక్స్ పరికరాలను రష్యాకు చెందిన ఆర్టెంక్స్ కంపెనీకి సరఫరా చేసిందని ఆర్‌ఆర్‌జీ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ సంస్థపై, రక్షణ పరికరాల తయారీకి అవసరమైన యంత్రాలను సరఫరా చేసిందని లోకేశ్ మెషీన్స్ సంస్థపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇక, ఆయుధాల తయారీలో ఉపయోగించే రోలర్ బేరింగ్‌లను రష్యాకు సరఫరా చేస్తున్నారని గేలక్సీ బేరింగ్స్ సంస్థపై, రాడార్, నావిగేషన్ పరికరాలను విక్రయిస్తున్నారని శౌర్య ఏరోనాటిక్స్‌పై ఆంక్షలు విధించారు.

## ఇప్పట్లో పెట్రో ధరలను తగ్గించలేం

### ఇంకా నష్టాల్లోనే చమురు కంపెనీలు

### కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ

న్యూఢిల్లీ,జూలై2: పెంచినే పెట్రో ధరలను ఇప్పట్లో తగ్గించే ఉద్దేశ్యం లేదని కేంద్రం స్పష్టం చేసింది. ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇప్పటికీ పెద్ద మొత్తంలో నష్టాలు చవిచూస్తున్నా యని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ అన్నారు. జూన్ 30 వరకు పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ విక్రయాలపై రూ.74,781 కోట్ల మేర నష్టం చవిచూసినట్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ.. పాత క్రూడాయిల్‌నే ఇప్పటికీ ప్రాసెస్ చేస్తుండడం ఇందుకు కారణమన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పెట్రో ఉత్పత్తులను ప్రాసెస్ చేయడానికి రెండు నెలల ముందే ముడి చమురును ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. రెండు నెలల ముందు నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుంది. అంటే ఇప్పుడు ప్రాసెస్ చేస్తున్న ముడి చమురు ఏప్రిల్ లేదా మే నెలలో కొన్నది. అప్పట్లో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు చాలా అధికంగా ఉన్నాయి. అమెరికా- ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరాక ముడిచమురు ధరలు దిగొచ్చాయని హర్దీప్ సింగ్ పురి వివరించారు. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు తగ్గిస్తారు? అని విలేకరులు ప్రశ్నించగా.. రాబోయే కొన్ని వారాల పాటు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు అది సమంజసమైన ప్రశ్న అవుతుందంటూ పురీ పేర్కొన్నారు.

# నేడు థియేటర్లలోకి నాగబంధం మూవీ

### హిందీ వర్షన్‌కు బై వన్ గెట్ 2 ఆఫర్



పౌరాణిక అంశాలు, ఫాంటసీ అడ్వెంచర్, థ్రిల్లింగ్ కథాంశంతో తెరకెక్కిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' సినిమా జులై 3న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మినన్ ప్రధాన పాత్రల్లో నటించారు. విడుదలకు ముందే ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడగా, ఇప్పుడు మేకర్స్ మరో ప్రత్యేక నిర్ణయంతో అందరి దృష్టిని ఆకర్షించారు. సినిమా విడుదల రోజునే ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్ర బృందం 'బై వన్ గెట్ వన్' ఆఫర్‌ను ప్రకటించింది. ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా అందించే ఈ స్కీమ్‌ను తొలి రోజు నుంచే అమలు చేస్తున్నారు. ఇటీవల బాలీవుడ్ సినిమాల్లో ఇలాంటి ప్రమోషనల్ ఆఫర్లు ఎక్కువగా కనిపిస్తుండగా, ఇప్పుడు తెలుగు సినిమాల్లో కూడా ఈ తరహా మార్కెటింగ్ వ్యూహాలు చోటుచేసుకోవడం ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఆఫర్ కేవలం హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుందని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు లేదా ఇతర భాషల వెర్షన్లకు ఈ సదుపాయం ఉండదు. 'నాగబంధం'ను అత్యంత భారీ నిర్మాణ విలువలతో రూపొందించారు. పౌరాణిక కథాంశానికి ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దినట్లు మేకర్స్ చెబుతున్నారు. ఫాంటసీ ప్రపంచం, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండనున్నాయని ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అడ్వెంచర్ అంశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటులు జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నగర్కర్, రిషభ్ సాహ్నీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథలో ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా దర్శకుడు అభిషేక్ నామా రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది. నాగబంధం' సినిమా కాదు... ఓ అనుభవం అన్నారు విరాట్‌కర్ణ. ఆయన కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే 'నాగబంధం'. ఓ నటుడిగా అందరి హృదయాల్లో స్థానం సంపాదించాలని ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశా. ఇంత పెద్ద సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడికి రుణపడి ఉంటా. ఇందులో ప్రతిదీ ఓ అద్భుతంలా ఉంటుంది. మన భారతీయ సంస్కృతి, వారసత్వానికి జరిగే ఓ వేడుకలాంటి సినిమా ఇది అన్నారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ అందరూ ప్రాణం పెట్టి చేసిన ఖరీదైన సినిమా ఇది. పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మన సంస్కృతి, మన మూలాల్ని ఆవిష్కరిస్తూ, సనాతన ధర్మం గురించి గొప్ప సందేశమిస్తుందీ చిత్రం. ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అనుభవాన్ని పంచేలా భారీ హంగులతో తెరకెక్కించాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రతి పది నిమిషాలకు ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే చిత్రమిది. విజువల్ వండర్‌గా అందరి హృదయాల్ని గెలుస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.



## ధృవ్ విక్రమ్‌తో మైత్రీ మూవీస్ చిత్రం ప్రారంభం








ఇటీవల బైసన్‌తో మెప్పించిన కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కుమారుడు, యువ సంచలనం ధ్రువ్ విక్రమ్ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఒక సరికొత్త చిత్రాన్ని ప్రకటించింది. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లో నాలుగో సినిమాగా వర్కింగ్ టైటిల్స్‌తో రూపొందుతున్న ఈ భారీ చిత్రం చెన్నైలో చిత్ర యూనిట్ సభ్యులు, పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లోనే ఇప్పటివరకు రాని ఒక డిఫరెంట్ జోనర్‌లో, అవుట్ అండ్ అవుట్ పక్కా కమర్షియల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని మలిచేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు డైరెక్టర్ కరణ్ ఎ. కుమార్ దర్శకత్వం వహిస్తుండగా, ఆయనతో పాటు రైటర్ శబీ సంయుక్తంగా ఈ చిత్రానికి స్క్రిప్ట్‌ను మరియు డైలాగ్స్‌ను అందిస్తున్నారు. కేవలం కథానాయకుడి పాత్రే కాకుండా సినిమాలో మిగిలిన పాత్రలు కూడా చాలా బలంగా ఉంటాయని, ఈ నేపథ్యంలోనే చిత్రంలో కీలక పాత్రల కోసం ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ మరియు యాక్టర్ సాయి దీనలను ఎంపిక చేసినట్లు చిత్రబృందం వెల్లడించింది. విక్కీ సినిమాటోగ్రాఫర్‌గా విజువల్స్ అందిస్తుండగా, చియాన్ ఎడిటర్‌గా, జి.ఎమ్. శేఖర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇందులో హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్ డిజైన్ చేయడం కోసం ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ వి.ఎమ్. మోర్‌ను రంగంలోకి దించారు. ఈ పూజా కార్యక్రమాలతోనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు కూడా శరవేగంగా జరుగుతున్నాయని, రాబోయే రోజుల్లో ఈ సినిమాకు సంబంధించిన పూర్తి తారాగణం, హీరోయిన్ మరియు టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా వెల్లడిస్తారని సమాచారం.

## సెన్సార్ నుంచి బటయపడని జననాయగన్

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జననాయగన్' రిలీజ్ చుట్టూ ఇండస్ట్రీలో సరికొత్త చర్చ నడుస్తోంది. గత 7 నెలలుగా ఈ చిత్రం సెన్సార్ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుండి 'ఎ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లోగా ఈ తుది సర్టిఫికేషన్ పక్రియ పూర్తి కానుందని ఆ వెంటనే హిందీ, తెలుగు వెర్షన్ల సెన్సార్ ఫార్మాలిటీస్‌ను కూడా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తోంది. సెన్సార్ సమస్యలు వీడుతుండటంతో మేకర్స్ ఈ సినిమాను జూలై 16 లేదా జూలై 23న థియేటర్లలోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం.




అయితే, ఇప్పటికే ఈ విండోలో పలు క్రేజీ చిత్రాలు తమ విడుదల తేదీలను ప్రకటించాయి. జూలై 17న 'అన్బే దయానా', జూలై 23న 'మకుటం', 'ఇమ్మోర్టల్', అలాగే జూలై 31న 'డిసి', 'సిగ్మా' వంటి చిత్రాలు లైన్లో ఉన్నాయి. ఇప్పుడు ఒకవేళ దళపతి విజయ్ రేసులోకి వస్తే ఇప్పటికే ప్రమోషన్లు మొదలుపెట్టిన ఆయా చిత్రాల కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే సెన్సార్ ఎ సర్టిఫికెట్ ఇస్తే చిన్న పిల్లలు ఈ సినిమా చూసేందుకు అనుమతించరు. తమ హీరో సినిమాను కావాలనే ఇబ్బందులు పెడుతున్నారని ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ దళపతి చివరి చిత్రం కావడంతో ఈ సినిమా ఎప్పుడు వచ్చినా థియేటర్ల వద్ద జాతర ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## బోస్నియాను చిత్తు చేసి అమెరికా

### ఏకంగా 24 ఏళ్ల తర్వాత చారిత్రాత్మక నాకౌట్ విక్టరీ

### ప్రికార్టర్స్ లో బెల్జియంతో అమీతుమీ సిద్ధం

ఫిఫా వరల్డ్ కప్ 2026 రౌండ్ ఆఫ్ 32 నాకౌట్ మ్యాచ్ లో కో-హోస్ట్ అమెరికా సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసింది. తాజాగా కాలిఫోర్నియా వేదికగా జరిగిన హై-టెన్షన్ మ్యాచ్ లో బోస్నియా అండ్ హెర్జెగోవినాను 2-0 తేడాతో ఓడించి రౌండ్ ఆఫ్ 16 లోకి అడుగుపెట్టింది. దీంతో 24 ఏళ్ల తర్వాత అమెరికా టీమ్‌కు ఒక వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్ లో విజయం దక్కడం ఇదే ఫస్ట్ టైమ్. లాస్ట్ టైమ్ జూన్ 17, 2002 లో మెక్సికోను 2-0 తో ఓడించి నాకౌట్ మ్యాచ్ గెలిచింది. ఈ బ్లాక్‌బస్టర్ మ్యాచ్ ను టీవీల్లో దాదాపు 30 మిలియన్ల మంది అమెరికన్స్ లైవ్ లో చూశారు. మ్యాచ్ ఫస్ట్ హాఫ్ ఎండ్ లో అమెరికా స్టార్ స్ట్రైకర్ ఫోలారిన్ బాలోగున్ సూపర్ గోల్ కొట్టి స్టేడియంలోని ఫ్యాన్స్ కు పూనకాలు తెప్పించాడు.ఫస్ట్ హాఫ్ లో అద్భుతమైన గోల్ కొట్టిన బాలోగున్, సెండ్ హాఫ్ లో ఒక పెద్ద వివాదంలో చిక్కుకున్నాడు. మ్యాచ్ 64వ నిమిషంలో బోస్నియా ప్లేయర్ తారిక్ ముహారెమోవిక్ కాలిపై తొక్కడంతో వీఏఆర్ రివ్యూ ద్వారా అంపైర్ అతనికి స్ట్రెయిట్ రెడ్ కార్డ్ చూపించి గ్రౌండ్ నుంచి పంపించేశాడు. దీంతో అమెరికా టీమ్ ఒక్కసారిగా షాక్ లో పడింది. కేవలం 10 మంది ప్లేయర్లతోనే మ్యాచ్ ఆడాల్సి రావడంతో కోచ్ మారిసియో పొచెటినో హైడ్రేషన్ బ్రేక్ టైమ్‌లో ప్లేయర్లందరినీ ఒక హడిల్ గా పిలిచి డిఫెన్స్ స్ట్రాంగ్ చేయాలంటూ మోటివేట్ చేశాడు. అమెరికా కెప్టెన్ క్రిస్టియన్ పులిసిక్ ఒక గోల్ కొట్టినా అది అంపైర్ ఆఫ్ సైడ్ గా డిక్లేర్ చేశాడు. బోస్నియా టీమ్ ఫస్ట్ హాఫ్ లో చాలా అటాకింగ్ గా ఆడింది. 40 ఏళ్ల లెజెండరీ కెప్టెన్ ఎడిన్ జెకో ఇచ్చిన పాస్ తో ఎర్మెడిన్ డెమిరోవిక్ కొట్టిన షాట్ ను అమెరికా కీపర్ మాట్ ఫ్రీజ్ సూపర్ సేవ్ తో అడ్డుకున్నాడు. సెండ్ హాఫ్ లో జెకో ఇంజరీ వల్ల గ్రౌండ్ వీడటం బోస్నియాను బాగా దెబ్బతీసింది. అమెరికా 10 మందితో ఆడుతున్న టైమ్‌లో బోస్నియాకు గోల్ కొట్టే గోల్డెన్ ఛాన్స్ వచ్చినా డెమిరోవిక్ మళ్లీ కీపర్ చేతుల్లోకే కొట్టాడు. మ్యాచ్ 82వ నిమిషంలో అమెరికాకు ఒక ఫ్రీ కిక్ లభించింది. ఈ గోల్డెన్ ఛాన్స్ ను మాలిక్ టిల్మాన్ ఒక క్లాసిక్ కర్లింగ్ షాట్ తో బోస్నియా కీపర్ నికోలా వాసిల్ ను దాటించి నెట్ లోకి పంపడంతో అమెరికా 2-0 లీడ్ సాధించి విక్టరీ కన్ఫర్మ్ చేసుకుంది. లాస్ట్ లో అంపైర్ ఇచ్చిన 10 నిమిషాల సుదీర్ఘ స్టాపేజ్ టైమ్ లో బోస్నియా సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ ఎర్మిన్ మహమిక్ కొట్టిన పవర్‌ఫుల్ షాట్ గోల్ పోస్ట్ పక్క నుంచి కొద్దిగా మిస్ అయింది. అమెరికా డిఫెండర్ టైలర్ ఆడమ్స్ మిడిల్ లో అద్భుతంగా బాల్స్ ను కంట్రోల్ చేస్తూ బోస్నియాకు ఎలాంటి ఛాన్స్ ఇవ్వకుండా క్లీన్ షీట్ మెయింటైన్ చేశాడు. మ్యాచ్ ముగియగానే స్టేడియం అంతా "ఖుూూా.. ఖుూూా" నినాదాలతో పాటు ఫేమస్ "టేక్ మీ హోమ్, కంట్రీ రోడ్స్" సాంగ్ తో ఫ్యాన్స్ సెలెబ్రేషన్స్ తో హోరెత్తించారు.

## దసరాకు విడుదల కానున్న విశ్వంభర

- సన్నాహాలు చేస్తోన్న చిత్రబృందం




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బ్జడెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహలు చేస్తుంది. చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు మీడియా, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్ మరియు గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోకసుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో-ఫాంటసీ సినిమా కావడంతో ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద మెగాస్టార్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

## 10న వస్తున్న లఖిల్ లెనిన్

- గ్యాప్ తరవాత విజయం కోసం ఎదురుచూపు




'లెనిన్'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు అఖిల్. మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జులై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాను మూడేళ్లు విరామం తీసుకోవడానికి గల కారణాన్ని అఖిల్ వివరించారు. ఏజెంట్' సినిమా విడుదలైన మూడు నెలలకు నేను ప్రమాదవశాత్తు బాత్రూంలో పడ్డాను. గాజు ముక్కలు నా చేతికి బలంగా గుచ్చుకున్నాయి. ఎడమ చేతి వేళ్లకు రెండు శస్త్రచికిత్సలు జరిగాయి. 48 కుట్లు పడ్డాయి. 8 నెలల పాటు బరువులు ఎత్తలేకపోయాను. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి 16 నెలలు పట్టింది. మూడేళ్లు విరామం తీసుకున్నందుకు నా అభిమానులు నాపై కోపంగా ఉన్నారు. ఇలా మరోసారి జరగదని వాళ్లకు నేను హామీ ఇస్తున్నాను అని అఖిల్ చెప్పారు. లెనిన్ చిత్రం గురించి మాట్లాడుతూ.. కథ వినగానే కొత్త అనుభూతి కలిగిందన్నారు. పాత్రల్లోని విభిన్న కోణాలు ఆశ్చర్యపరిచాయని తెలిపారు. ఇలాంటి కథే కాదు.. ఈ అంశంమీద ఒక్క సినిమా కూడా రాలేదని పేర్కొన్నారు. అందుకే ఇలాంటి సినిమాతోనే కమ్‌బ్యాక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

## జైలర్-2 షూటింగ్ పూర్తి

- ప్రత్యేక పాత్రలో హృత్రిక రోషన్

మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రానికి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. తాజాగా 'జైలర్ 2' షూటింగ్ పూర్తయినట్లు టీమ్ తెలిపింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. నిజానికి ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే పూర్తయింది. కానీ, నెల్సన్ ఈ కథలో మరికొన్ని కొత్త సన్నివేశాలు యాడ్ చేసి 25 రోజుల పాటు మళ్లీ షూటింగ్ నిర్వహించారు. తాజాగా అవి కూడా పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది.ఈ చిత్రంలో హృతిక్ రోషన్ అతిథి పాత్రలో నటిస్తున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఆయన చెన్నై రావడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ 25 రోజుల షెడ్యూల్‌లో ఆయనకు సంబంధించిన సన్నివేశాలనే చిత్రీకరించారని సమాచారం.


# హార్దిక్ పాండ్యాతో సీఎస్కే ట్రేడ్ డీల్ జరగలేదు

**సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ వెల్లడి**



ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరుతున్నాడనే ప్రచారానికి సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ బ్రేక్ వేశారు. హార్దిక్ ట్రేడింగ్‌పై తమ ఫ్రాంచైజీలో ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ ముగిసిన తర్వాతే.. ఐపీఎల్ 2026 ప్రదర్శనపై రివ్యూ నిర్వహించి, ఐపీఎల్ 2027 ట్రేడ్‌లపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. దీంతో హార్దిక్ ట్రేడ్‌పై ఊహాగానాలకు చెక్ పడ్డట్లయింది. ఐపీఎల్ 2026 ముగిసినప్పటి నుంచి సోషల్ మీడియాలో హార్దిక్ పాండ్యా చర్చనీయాంశంగా మారిపోయాడు. మూడేళ్ల క్రితం ముంబై ఇండియన్స్‌లోకి కెప్టెన్‌గా రీఎంట్రీ ఇచ్చిన అతడు.. ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయాడు. ఈ మూడు సీజన్లలో ముంబై రెండు సార్లు లీగ్ స్టేజ్‌కే పరిమితమైంది. దానికి తోడు జట్టులో అతడు ఒంటరి అయ్యాడని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యా వచ్చే ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబైని వీడతాడని జోరుగా వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఈ వార్తలు మరింత పెరిగాయి. ట్రేడ్ విండోలో అతడిని దక్కించుకునేందుకు ఫ్రాంచైజీలు పోటీ పడుతున్నాయని సమాచారం. తాజాగా చెన్నై సూపర్ కింగ్స్ సైతం అతడి కోసం ప్రయత్నిస్తోందని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై చెన్నై సూపర్ కింగ్స్ సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందించారు. హార్దిక్ పాండ్యాను ట్రేడ్ ద్వారా జట్టులోకి తీసుకురావడంపై ఇప్పటివరకు చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. "హార్దిక్ పాండ్యా ట్రేడ్ విషయంపై ఇప్పటివరకు మా ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్‌లో ఎలాంటి చర్చ జరగలేదు. ఐపీఎల్ 2026పై రివ్యూ మీటింగ్ జరిగిన తర్వాతే.. ట్రేడ్‌లపై నిర్ణయాలు తీసుకుంటాం. మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) ముగిసిన తర్వాత ఐపీఎల్ 2026పై రివ్యూ ఉంటుంది" అని కాశీ విశ్వనాథన్ వెల్లడించారు. దీంతో చెన్నై సూపర్ కింగ్స్‌లో హార్దిక్ పాండ్యా వెళ్లడం దాదాపుగా ఖరారైందని వార్తలకు చెక్ పడినట్లయింది. ఇక మేజర్ లీగ్ క్రికెట్ ప్రస్తుతం అమెరికాలో జరుగుతోంది. జులై 18 వరకు ఈ లీగ్ జరగనుంది. ఇందులో సీఎస్కే అనుబంధ జట్టైన టెక్సాస్ సూపర్ కింగ్స్ కూడా పాల్గొంటోంది. అందుకే ఎంఎల్‌సీ ముగిసిన తర్వాతే ఐపీఎల్ 2027 సీజన్‌పై పూర్తి సమీక్ష నిర్వహించి, ట్రేడ్‌లపై నిర్ణయం తీసుకోనున్నట్లు సీఎస్కే యాజమాన్యం స్పష్టం చేసింది. మరోవైపు హార్దిక్ పాండ్యా కోసం ఏడు ఫ్రాంచైజీలు పోటీ పడుతున్నట్లు సమాచారం. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్ రైజర్స్ హైదరాబాద్ మినహా.. మిగతా ఫ్రాంఛైజీలు అతడిని దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయట!

## ప్రాక్టీస్ ప్రారంభించిన విరాట్ కోహ్లీ



గాయం కారణంగా ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ.. జూలై 14 నుంచి ప్రారంభం కానున్న ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌కు సిద్ధమవుతున్నాడు. మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్‌తో కలిసి కోహ్లీ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే, అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే బరిలోకి దిగుతాడని బీసీసీఐ పేర్కొంది. ఈ 3 మ్యాచ్‌ల సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. గాయం కారణంగా అఫ్ఘానిస్థాన్‌తో వన్డే సిరీస్‌కు దూరమైన టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ .. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు సిద్ధం అవుతున్నాడు. జులై 14 నుంచి జరగనున్న ఈ సిరీస్ కోసం ఇప్పటికే భారత జట్టును ప్రకటించింది బీసీసీఐ. ఈ జట్టులో విరాట్ కోహ్లీకి సైతం చోటు దక్కింది. అయితే పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే అతడు బరిలోకి దిగుతాడని కండిషన్ పెట్టింది. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లీ.. ఫిట్‌నెస్‌పై ఫోకస్ చేశాడు. గ్రౌండ్‌లోకి అడుగుపెట్టాడు. భారత మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్‌తో కలిసి విరాట్ ప్రాక్టీస్ ప్రారంభించాడు. ఇందుకు సంబంధించిన ఫొటో, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇది చూసిన అభిమానులు.. కింగ్ వచ్చేస్తున్నాడు అని కామెంట్లు చేస్తున్నారు. కోహ్లీ రీఎంట్రీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొంటున్నారు. టెస్ట్, టీ20లకు గుడ్‌బై చెప్పిన విరాట్ కోహ్లీ.. ప్రస్తుతం కేవలం 50 ఓవర్ల క్రికెట్ ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027లో కచ్చితంగా ఆడాలని పట్టుదలతో ముందుకెళ్తున్నాడు. దీంతో అతడు ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది ఆసక్తికరంగా మారింది. రోహిత్ శర్మ సైతం వన్డే ప్రపంచకప్‌లో ఆడాలంటే.. ఇంగ్లాండ్ గడ్డపై సత్తాచాటడం ముఖ్యం. ఇక ఈ సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు చోటు దక్కలేదు. కానీ కాస్త విరామం తర్వాత జస్‌ప్రీత్ బుమ్రా.. తిరిగి జట్టులోకి వచ్చాడు.

# సెనెగల్‌పై బెల్జియం సంచలన విజయం



ఫిఫా ప్రపంచకప్ 2026లో భాగంగా జరిగిన రౌండ్ ఆఫ్ 32 నాకౌట్ మ్యాచ్‌లో బెల్జియం అద్భుత విజయం సాధించింది. సెనెగల్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఒకానొక దశలో 0–2తో వెనుకబడిన బెల్జియం, అనూహ్యంగా పుంజుకుని 3–2 తేడాతో గెలిచి అందరినీ అశర్చపర్చింది. మ్యాచ్ ముగియడానికి కొన్ని క్షణాల ముందు యూరి టైల్‌మన్స్ పెనాల్టీని గోల్‌గా మలిచి బెల్జియంకు అపురూప విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో బెల్జియం ప్రి-క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. సెనెగల్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ హిస్టరీలో బెల్జియం, సెనెగల్ జట్లు తలపడటం ఇదే మొదటిసారి. మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే బెల్జియం తరఫున లియాండ్రో ట్రోసార్డ్ గోల్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ, ఆ తర్వాత పూర్తి ఆధిపత్యం సెనెగల్‌దే అయ్యింది. 'లయన్స్ ఆఫ్ టెరంగో'గా పిలవబడే సెనెగల్ ఆటగాళ్లు మైదానంలో చిరుతల్లా కదిలారు. దిగ్గజ ఆటగాడు సాడియో మానే పెనాల్టీ బాక్స్ వైపు ఒక అద్భుతమైన క్రాస్ పాస్ అందించాడు. దీనిని అందుకున్న ఇస్మాయిలా గోల్ చేయడానికి ప్రయత్నించగా, బంతి పోస్ట్‌కి తగిలి రీబౌండ్ అయింది. అయితే, అక్కడే అప్రమత్తంగా ఉన్న సెనెగల్ యువ మిడ్‌ఫీల్డర్ హబీబ్ దియారా ఆ రీబౌండ్ బంతిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్ పోస్ట్‌లోకి నెట్టాడు. దీంతో మ్యాచ్ మొదటి అర్ధభాగంలో సెనెగల్ 1–0 ఆధిక్యాన్ని సంపాదించింది. సెకండాఫ్ ప్రారంభమైన వెంటనే బెల్జియం కోలుకుంటుందని భావించిన అభిమానులకు సెనెగల్ మళ్లీ షాక్ ఇచ్చింది. సెకండాఫ్ మొదలైన కేవలం ఆరు నిమిషాలకే లాంగ్ బాల్‌ను ఇస్మాయిలా అద్భుతంగా అందుకున్నాడు. బెల్జియం బలమైన డిఫెండర్లను పక్కకు నెట్టేస్తూ, ప్రపంచ అత్యుత్తమ గోల్‌కీపర్లలో ఒకరైన తిబౌట్ కోర్టోయిస్‌ను ఛేధిస్తూ బంతిని గోల్ నెట్‌లోకి పంపాడు. దీంతో సెనెగల్ 2–0తో ఆధిక్యాన్ని సాధించి, మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. ఈ మ్యాచ్‌లో చేసిన గోల్‌తో కలిపి ఇస్మాయిలా సార్ ప్రస్తుత 2026 ప్రపంచకప్‌లో మొత్తం 4 గోల్స్ పూర్తి చేసుకున్నాడు. దీనితో ఒకే ప్రపంచకప్ ఎడిషన్‌లో అత్యధిక గోల్స్ చేసిన ఆఫ్రికన్ ఆటగాడిగా 1990లో కెమరూన్ లెజెండ్ రోజర్ మిల్లా నెలకొల్పిన చారిత్రాత్మక రికార్డును సార్ సమం చేశాడు. టోర్నీ నుంచి నిష్క్రమణ ఖాయమని భావిస్తున్న తరుణంలో బెల్జియం కోచ్ వ్యూహాత్మకంగా మార్పులు చేశాడు. బెంచ్‌పై ఉన్న అనుభవజ్ఞులైన ఆటగాళ్లను మైదానంలోకి దించాడు. ఆట 70వ నిమిషం దాటిన తర్వాత బెల్జియం ఆటలో వేగం పెరిగింది. థామస్ మునియర్ కుడి వైపు నుంచి అందించిన షార్ప్ క్రాస్‌ను బెల్జియం స్టార్ స్ట్రైకర్ రోమేలు తనదైన శైలిలో గోల్ పోస్ట్ దగ్గర నుంచి నెట్‌లోకి పంపి బెల్జియం ఖాతా తెరిచాడు. ఈ గోల్‌తో బెల్జియంలో ఆశలు చిగురించాయి. కొద్దిసేపటికే ట్రోసార్డ్ అందించిన అద్భుతమైన పాస్‌ను యూరి టైల్‌మన్స్ గోల్‌గా మలిచాడు. దీనితో స్కోరు 2–2తో సమం చేశాడు. ఈ క్రమంలో నిర్ణీత 90 నిమిషాల్లో గోల్ నమోదు కాకపోవడంతో మ్యాచ్ ఎక్స్‌ట్రా టైమ్‌కు దారితీసింది. 30 నిమిషాల అదనపు సమయంలో ఇరు జట్ల ఆటగాళ్లు తీవ్ర అలసటకు గురైనప్పటికీ విజయం కోసం శ్రమించారు. సమయం ముగుస్తుండటంతో విజేతను తేల్చడానికి 'పెనాల్టీ షూటౌట్' తప్పదని అందరూ భావించారు. అయితే, ఎక్స్‌ట్రా టైమ్ చివరి నిమిషంలో మ్యాచ్‌ను మలుపు తిప్పే సంఘటన జరిగింది. బెల్జియం ఆటగాడు యూరి టైల్‌మన్స్ సెనెగల్ డిఫెన్స్ బాక్స్‌లోకి దూసుకెళ్తుండగా, సెనెగల్ ప్లేయర్ లామిన్ కమారా అతడిని ఫౌల్ చేశాడు. దీనిపై వివాదం చెలరేగడంతో ఫీల్డ్ అంపైర్ వీఏఆర్ సమీక్షను కోరాడు. రీప్లేలో ఫౌల్ జరిగినట్లు స్పష్టమవ్వడంతో బెల్జియంకు పెనాల్టీ కిక్ లభించింది. 125వ నిమిషంలో యూరి టైల్‌మన్స్ పెనాల్టీని తీసుకోవడానికి సిద్ధమయ్యాడు. ఒక్క తప్పు జరిగినా మ్యాచ్ చేజారుతుందనే ఒత్తిడి ఉన్నప్పటికీ, టైల్‌మన్స్ ఏమాత్రం తడబడకుండా బంతిని గోల్ పోస్ట్ మూలలోకి పంపాడు. అంతే, మైదానంలో బెల్జియం ఆటగాళ్లు, అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. స్కోరు 3–2తో బెల్జియం వశమైంది.

# భారత్, ఇంగ్లాండ్ తొలి టీ20 మ్యాచ్ వర్షార్పణం

### 189 పరుగుల భారీ స్కోరు చేసిన భారత్



భారత్, ఇంగ్లాండ్ మధ్య జరగాల్సిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. చెస్టర్ లీ స్ట్రీట్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా.. అభిషేక్ శర్మ (59), శ్రేయస్ అయ్యర్ (68) హాఫ్ సెంచరీలతో 189 పరుగుల భారీ స్కోరు చేసింది. అయితే భారత్ ఇన్నింగ్స్ ముగిసిన వెంటనే వర్షం తీవ్రం కావడంతో ఇంగ్లాండ్ బ్యాటింగ్‌కు వీలుపడలేదు. అంపైర్లు డీఎల్ఎస్ పద్ధతిలో ఓవర్లను కుదించినా వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. ఐర్లాండ్‌తో సిరీస్‌లో తేలిపోయిన భారత బ్యాటర్లు.. వేదిక మారగానే సత్తాచాటారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ 24 బంతుల్లో 59 రన్స్ బ్యాట్ ఝుళిపించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (47 బంతుల్లో 68 రన్స్) సైతం ఫర్వాలేదనిపించాడు. చివర్లో శివమ్ దూబె (21 బంతుల్లో 42 రన్స్) మంచి ఫినిషింగ్ ఇచ్చాడు. దీంతో 7 వికెట్ల నష్టానికి టీమిండియా 189 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో సాకిబ్ మహమూద్ 3 వికెట్లు తీశాడు. ఆదిల్ రషీద్, సామ్ కర్రన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. నిజానికి ఈ మ్యాచ్ ప్రారంభం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. కానీ ఆటకు అంతరాయం కలిగేంత కాదు. ఆ చిరు జల్లుల మధ్య భారత బ్యాటింగ్ కొనసాగించారు. కానీ ఇన్నింగ్స్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వర్షం ఎక్కువ కావడంతో ఆటగాళు డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితమయ్యారు. వర్షం తగ్గితే మ్యాచ్ నిర్వహించేందుకు అంపైర్లు ప్రయత్నించారు. అందుకోసం ఇంగ్లాండ్ లక్ష్యాన్ని సవరించారు. కానీ వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. మరోవైపు చెస్టర్ లీ స్ట్రీట్ వేదికగా భారత్ ఆడిన మూడు మ్యాచులు ఫలితం రాకుండానే ముగియడం గమనార్హం. 2002, 2011లో ఇంగ్లాండ్‌తో జరగాల్సిన వన్డే మ్యాచులలో ఫలితం రాలేదు. వర్షం కారణంగా ఆ మ్యాచులు రద్దు చేశారు. తాజా సిరీస్‌లో తొలి టీ20 మ్యాచ్ కూడా వర్షార్పణ అయింది. ఈ సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్ జులై 4న జరగనుంది.



టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 6 పరుగులకే శాంసన్, ఇషాన్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ అభిషేక్ శర్మ (24 బంతుల్లో 59) మెరుపు హాఫ్ సెంచరీతో ఇంగ్లాండ్ బౌలర్లపై విరుచుకుపడగా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (68) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖర్లో శివమ్ దూబె (42బి) రాణించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేసింది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టీ20 మ్యాచులో భారత జట్టు భారీ స్కోరు చేసింది. చెస్టర్ లీ స్ట్రీట్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచులో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ బ్యాటర్లు రాణించారు. ఓపెనర్ అభిషేక్ శర్మ .. ఇంగ్లాండ్ బౌలర్లను షేక్ చేశాడు. శ్రేయస్ అయ్యర్ కూడా హాఫ్ సెంచరీ చేయడంతో భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 189 పరుగులు స్కోరు చేసింది. సంజూ శాంసన్.. వరుసగా మూడో మ్యాచులో విఫలమయ్యాడు. ఏడు బంతుల్లో ఒక పరుగు మాత్రమే చేసి పెవిలియన్ చేరిపోయాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్.. రనౌట్ అయ్యాడు. 2 బంతుల్లో ఒక్క పరుగు కూడా చేయకుండానే నిష్క్రమించాడు. దీంతో భారత్.. 6 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కానీ ఈ సమయంలో అభిషేక్ శర్మ అదరగొట్టాడు. తనదైన శైలిలో బ్యాట్ ఝుళిపించాడు. 20 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన అభిషేక్ శర్మ.. మొత్తంగా 24 బంతుల్లో 59 రన్స్ చేసి ఔట్ అయ్యాడు. ఇందులో 4 సిక్సులు, ఆరు ఫోర్లు ఉన్నాయి. ఇక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 47 బంతుల్లో 68 పరుగులు చేశాడు. చివర్లో శివమ్ దూబె ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. 21 బంతుల్లో 42 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో టీమిండియా 7 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది.

# ఫ్యాన్స్‌కి హ్యారీ కేన్ రొమాంటిక్ ట్రీట్

ఫీఫా ప్రపంచ కప్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో కెప్టెన్ హ్యారీ కేన్ రెండవ అర్ధభాగంలో చేసిన రెండు గోల్స్ పుణ్యమా అని ఇంగ్లండ్ 2–1 తేడాతో కాంగోను ఓడించింది. తొలి గోల్ తిన్న తర్వాత ఇంగ్లండ్ ఒక ప్రపంచ కప్ మ్యాచ్ గెలవడం ఇది కేవలం రెండవసారి మాత్రమే. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని హ్యారీ కేన్ తన భార్య కేట్‌ను ముద్దుపెట్టుకుని, తన పిల్లలను కౌగిలించుకుని సంబరాలు చేసుకున్నాడు. అట్లాంటాలో జరిగిన మ్యాచ్ అనంతరం బుధవారం అర్ధరాత్రి వేళ కేన్ నేరుగా తన కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లాడు. దేశం కోసం మరోసారి కీలక సమయంలో జట్టును ఆదుకున్నందుకు వారు ఆ కెప్టెన్‌ను అభినందించారు. అట్లాంటా ఫాల్కన్స్ హోమ్ గ్రౌండ్‌లోని గ్యాలరీలో జూడ్ బెల్లింగ్‌హామ్ ప్రేయసి అసంతేవా చిట్టి కూడా కనిపించింది. గోల్‌కీపర్ జోర్డాన్ పిక్‌ఫోర్డ్ భాగస్వామి మేగన్ డేవిసన్ కూడా అక్కడ ఉన్నారు. డేవిసన్ తన ప్రియుడికి గౌరవసూచకంగా ఇంగ్లాండ్ గోల్‌కీపర్ ఆకుపచ్చ జెర్సీని ధరించి, మైదానం వైపు చేయి ఊపింది. తన సీటులో కూర్చుంటున్నప్పుడు ఆమె తన ఫోన్‌లో తన రూపాన్ని సరిచూసుకోవడం కూడా కనిపించింది. జట్టు వెనుకబడి ఉన్నప్పుడు ఆమె ప్రార్థించడం కనిపించింది. ఆలీ వాట్కిన్స్ భార్య ఎల్లీ ఆల్డర్సన్ తన సీటు వద్దకు 'లక్కీ చికెన్ టెండర్స్' ఉన్న ట్రేను తీసుకువచ్చింది. ఈ విజయంతో 1966 ఛాంపియన్లు రౌండ్ ఆఫ్ 16లో స్థానం సంపాదించుకున్నారు. అక్కడ వారు అజ్టెకా స్టేడియంలో సహ–ఆతిథ్య దేశమైన మెక్సికోతో తలపడతారు. దీనికి ముందు 0--1తో వెనుకబడిన తర్వాత ఇంగ్లాండ్ ఒక ప్రపంచ కప్ మ్యాచ్ గెలవడం ఇది రెండవసారి మాత్రమే జరిగింది. అది కూడా 1966లో వెంబ్లీ స్టేడియంలో పశ్చిమ జర్మనీతో జరిగిన ఫైనల్‌లో. ఈ టోర్నమెంట్‌లో తన గోల్స్ సంఖ్యను ఐదుకు చేర్చిన తర్వాత, కెప్టెన్ కేన్ ఇలా అన్నారు. అదంతా కేవలం పట్టుదలగా ప్రయత్నిస్తూ ఉండటమే. ప్రయత్నం కొనసాగిస్తే, మాకూ ఆ సమయం వస్తుంది. ఆ ప్రత్యేక క్షణాల గురించి మేము మాట్లాడుకునేవాళ్ళమని జట్టులో ఎవరికైనా రావచ్చు. చివరికి హీరోగా నిలిచే అవకాశాలు అందరికీ లభిస్తాయి. నా విషయానికొస్తే ఆ రోజు నాకు అటువంటి అవకాశం దక్కింది. ఇంగ్లాండ్ తరఫున కేన్ సాధించిన 13వ ప్రపంచ కప్ గోల్ (రికార్డు మెరుగుదల) మెర్సిడెస్–బెంజ్ స్టేడియంలో, కేన్ తన గోల్స్ సంఖ్యను 13కి పెంచుకుని ఈ టోర్నమెంట్ చరిత్రలో తన దేశం తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. జాతీయ జట్టు తరఫున మొత్తం 84 గోల్స్ సాధించిన రికార్డు ఇప్పుడు అతని పేరిట ఉంది. ఏడవ నిమిషంలో బ్రియాన్ సిపెంగా కాంగోకు ఆధిక్యం అందించాడు. అతను బాక్స్ ఎడమ వైపు నుండి వచ్చిన క్రాస్‌ను అందుకుని, ఇంగ్లాండ్ గోల్ కీపర్ జోర్డాన్ పిక్‌ఫోర్డ్‌ను ఓడించి గోల్ చేశాడు. 75వ నిమిషంలో హ్యారీ కేన్ ఇంగ్లాండ్ తరఫున స్కోరును సమం చేశాడు. ఆంథోనీ గోర్డాన్ ఎడమ వైపు నుండి అందించిన క్రాస్‌ను, కేన్ హెడర్‌తో కొట్టగా, కాంగో గోల్ కీపర్ మ్పాసి చేతితో అడ్డుకున్నప్పటికీ, బంతి గోల్ పోస్ట్‌లోకి దూసుకెళ్లింది. 11 నిమిషాల తర్వాత కేన్ మళ్లీ గోల్ చేసి, కాంగో సంచలనం సృష్టించే ఏ అవకాశాన్నైనా సమర్ధవంతంగా ముగించాడు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609